# తృప్తి

ఎమ్. వి. ఎస్. ఎస్. ప్రసాద్

నేను ఆ రోజు ఉదయం నుంచి అన్యమనస్కం గానే ఉన్నాను. ఆ ఉదయం జరిగిన సంఘటన నా మనసుని కుదిపివేసింది. ఇంకా నేను తేరు కోలేకపోతున్నాను.

ఆ రోజు సాయంత్రం ఊరు నుంచి వచ్చిన నా శ్రీమతి నీరజ నన్ను చూసి చాలా కంగారు పడిపోయింది. మా పెళ్లయిన ఏడాదిలో నన్ను అలా ఎప్పుడూ చూడలేదంది. నాకు ఒంట్లో బాగాలేదేమో అర్జంటుగా డాక్టరు దగ్గరికి వెళదా మంది. నేను సున్నితంగా తిరస్కరించి కంగారు పడవలసినది ఏమీలేదని సమాధాన పరిచాను. నిజానికి ఉదయం జరిగిన సంఘటన ఆమెకు చెప్పే ధైర్యం లేదు. ఉదయం జరిగిన సంఘటన నా మస్తిష్కంలో సుడులు తిరగసాగింది.

ఆ రోజు ఆదివారం కావడం చేత నీరజ ఊళ్లో లేకపోవడం వలన నేను ఆలస్యంగా లేచా ను. కాఫీ త్రాగుతుండగా ప్రక్కింటి లత దూసు కొచ్చింది. ఆ అమ్మాయికి సుమారు ఇరవై సంవ త్సరాలు ఉంటాయి. డిగ్రీ పూర్తి చేసి, ప్రస్తుతం ఖాళీగా ఉంటోంది.

"హాయ్! అంకుల్! గుడ్ మార్నింగ్" అంది లత లేడి పిల్లలా ఇంట్లోకి పరిగెత్తి వస్తూ. ఆమె కళ్లు వింత కాంతితో మెరుస్తున్నాయి.

"గుడ్‌మార్నింగ్. ఏమిటి ఇంత ఉదయాన్నే వచ్చావు? మీ ఆంటీ ఇంకా రాలేదు" అన్నాను నేను.

"ఆంటీ లేదనీ, సాయంత్రం వరకూ రాదని తెలుసు – నిన్న రాత్రే తనతో మాట్లాడాను".

"ఆహా!" అన్నాను నేను.

"ఇంట్లో ఎవరూ లేరు అంకుల్. అందరూ ఊరికి వెళ్లారు. సాయంత్రానికి కానీ రారు. బోర్‌గా ఉంది... అందుకని..."

"నీ డ్యూటీ సినిమాలు చూడడం, టీవీలో ప్రోగ్రాములు కంఠతా పట్టడం కదా. డ్యూటీ మొదలుపెట్టు..." అన్నాను నేను నవ్వుతూ.

ఈ రోజు కాస్త చేంజ్ కావాలనుకుంటోంది ఈ మనసు...

లత మాటలు నాకు ఎందుకో వింతగా తోచాయి. "ఇంతకీ మీ వాళ్లు ఏ ఊరు వెళ్లా రు?" అని అడిగాను నేను.

"ఏదో గుడికి వెళ్లారు. నాకు గుడులు, గోపురాలు నచ్చవు. అంతా ట్రాష్. తమ మీద తమకు నమ్మకం లేని మనుషులు పెంచుకునే మూఢనమ్మకాలే ఈ దేవుళ్లు, పూజలు" అంది లత తల ఎగరేస్తూ.

నాకు ఆమెలో ఒక సగటు ఆధునిక అమ్మా యి కనిపించింది ఆ క్షణంలో.

"ఎవరి నమ్మకాలు వాళ్లవి" అన్నాను నేను ఆమె కళ్లలోకి పరిశీలనగా చూస్తూ.

"చూడండి అంకుల్ నా ఉద్దేశ్యంలో ఈ నమ్మకాలు, విలువలు, నీతి, నిజాయితీ... అన్నీ కూడా చేతకానివాళ్లు కల్పించుకున్న జైలు గోడలు".

లత నాకు గత ఏడాదిగా పరిచయమున్నా ఆ రోజు ఆమెలో ఏదో మార్పు కనిపిస్తోంది. ఆమె మాటలలో ఏదో కొత్తదనం కనిపిస్తోంది. లత సాధారణంగా చనువుగా, సరదాగా మాట్లా

డుతుంది. నేనూ అలాగే ఉంటాను. కానీ ఈ రోజు ఆమెలో ఏదో తేడా కనిపిస్తోంది.

"మీకు కూడా ఈ కట్టుబాట్లు, నిషేధాలు, మంచీ చెడూ... వాటిమీద నమ్మకముందా అంకుల్. అఫ్‌కోర్స్, ఐడోంట్ బిలీవ్ ఇన్ దోస్ థింగ్స్".

"అవన్నీ పెద్దవాళ్లు సమాజ శ్రేయస్సు కోసం, మన మంచికోసం పెట్టినవి లతా".

"కానీ అంకుల్ ఇవన్నీ కూడా మనిషి ఆనందానికి, సంతోషానికీ [illegible] మనిషి మిగతా జీవుల్లా స్వేచ్ఛగా ఉండకుండా పెద్దలు అనేవాళ్లు తగిలించిన సంకెళ్లు...!"

"ఆనందం అనేది శాశ్వతం. సుఖం, దుఃఖం అనేవి తాత్కాలికం. ఏది ఏమైనా మనిషి సుఖం గా ఉండాలంటే పెద్దలు నిర్దేశించిన మార్గంలో నే నడవడం మంచిది" అన్నాను నేను. మరల నేనే "లతా... ఈ రోజు చాలా వింతగా మాట్లా డుతున్నావేమిటి!?" అని అడిగాను.



"మాట్లాడడమే కాదు ప్రవర్తిస్తాను కూడా..." అంటూ పకపకా నవ్వసాగింది లత.

అంతలో అనూహ్యమైన సంఘటన జరిగింది. లత ఉన్నట్టుండి నన్ను కౌగిలించుకుంది. ఒక్క క్షణం ఏం జరుగుతోందో నాకు తెలియలేదు. మరుక్షణం తేరుకుని ఆమెని దూరంగా తోసేసాను.

"ఏంటి అంకుల్ అలా తోసేస్తారు!!?... మావాళ్లు లేరు... ఆంటీ లేరు. మనకి ఇదొక గోల్డెన్ ఛాన్స్... నో ప్రెగ్నెన్సీ పిల్ నాదగ్గర రెడీగా ఉంది... కమాన్ లెటజ్ ఎంజాయ్..." లత గొంతులో ఏదో మత్తు, జీర ధ్వనించాయి. మరల నామీదకు రాసాగింది.

"చూడు లతా! తప్పమ్మా... నువ్వలా ఆలోచించకూడదు... అలా ప్రవర్తించకూడదు... నువ్వు పెళ్లికావల్సిన పిల్లవి... ఈ వయసులో ఇలాంటి ఆలోచనలు, ఉద్రేకాలూ నేటి యువతరానికి అసహజం కాకపోయినా, ఆరోగ్యకరం కాదు... కంట్రోల్ యువర్‌సెల్ఫ్... నువ్వు తప్పు చేస్తున్నావు... తెలుసుకో" అన్నాను నేను.

"కమాన్" అంటూ తమకంతో నన్ను బాహువులలో బంధించే ప్రయత్నం చేసింది లత.

నేను నా బలాన్నంతా ఉపయోగించి ఆమెను వెనక్కు త్రోసేసాను. నా కళ్లు అగ్నివర్షం కురిపించడం ప్రారంభించాయి.

"ఇంకొక్క క్షణం ఇక్కడ ఉన్నావంటే ఏం చేస్తానో నాకే తెలియదు... యూ గెటౌట్" అన్నాను తీవ్ర స్వరంతో.

లత అహం దెబ్బతిందిలా ఉంది. గాయపడ్డ ఆడ బెబ్బులిలా అరవసాగింది.

"ఛీ! యూ ఇంపొటెంట్ ఫెలో... వయస్సులో ఉన్న ఒక అమ్మాయి కావాలని వస్తే పారిపోయే మచ్చేం మగాడివి... అయినా నీలాంటి వాడివి ఆంటీని ఎలా చూసుకుంటున్నావో. ఏం సుఖపెడుతున్నావో అర్థమవుతోంది... అసలు నీలాంటి మగతనం లేని వాడి మీద మనసు పడడం నాదే బుద్ధి తక్కువ... నీ సంగతి నపుంసకుడివి అనుకోలేదు" అంటూ నన్ను రెచ్చగొట్టే ధోరణిలో చాలా అసహ్యంగా మాట్లాడసాగింది.

నన్ను నేను అన్ని విధాలా నిగ్రహించుకోగలిగాను. అయినా కోపంగా చూపుడు వేలుతో గుమ్మం వైపు చూపించాను.

ఆ నిమిషంలో లత చూసిన చూపుకు శక్తి ఉంటే నేను బూడిద అయిపోయేవాడిని. పరుగులాంటి నడకతో బయటికి నడిచింది లత. కాఫీ తీసుకు వచ్చిన నీరజ పిలుపుతో నా ఆలోచనలకు అంతరాయం కలిగింది. కాఫీ త్రాగుతూ మరలా ఆలోచించసాగాను.

"అవును. నేను ఇంపొటెంటునే!!!? ఈ సమాజాన్ని, మనుషులను నాశనం చేయడం తప్పని, అన్యాయమని తెలిసి, ఆ పనులు చేయడం చేతకానివాడిని. లత లాంటి వాళ్ల బలహీనతలు అవకాశాలుగా మలుచుకోవడం తప్పని, సామాజిక నేరమని తెలిసిన అసమర్థుడను. సమాజాన్ని బాగు చేయలేకపోయినా పాడు చేయకూడదనే భావం కలిగిన పిచ్చివాడిని".

కానీ తను ఏం ఆలోచిస్తోందో, ఏం చేస్తోందో తెలియని ఒక అమాయకురాలి జీవితం నాశనం కాకుండా కాపాడగలిగాననే భావన ఎంతో తృప్తినిచ్చింది.

జరిగిన విషయం ఇద్దరి మనస్సులలోనే సమాధి అవ్వాలని, అవుతుందని నమ్మకం కలిగింది. ఒక చెడు జరగకుండా ఆపగలిగాననే తృప్తి నాకు మిగిలింది. ఆ క్షణంలో నా హృదయం తేలికపడింది. ●